ఖాళీ అవుతున్న సింగితం..



2



2

దీపం అంటుకుని ఇల్లు దగ్ధం

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

## నగరంలో రేపటి నుంచి జెండా జాతర

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని జెండా బాలాజీ ఆలయం జాతర ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు వంశపారపర్య అర్చకులు అజయ్ సంగ్వాయి తెలిపారు. ఉదయం 8 గంటలకు పెద్ద బజార్‌లోని స్వగృహం నుంచి ఉత్సవమూర్తులను, జెండాను ఆలయానికి శోభాయాత్రగా ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. అయితే జెండాను మోసే ఆర్మూర్ వంశీయుల్లో ఒకరు మృతి చెందడంతో కావడంతో ఈసారి పురవీధుల్లో జెండా ఊరేగింపు నిర్వహించడం లేదని తెలిపారు. పెద్దబజార్ నుంచి బార్సింగ్ బాబా ఆలయం వరకు వెళ్లి తిరిగి జెండా గుడికి వెళ్తుందన్నారు. కావున భక్తులు సహకరించి ఆలయంలోనే జెండాను దర్శించుకోవాలని కోరారు.



## లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



అమావాస్య శనివారం రావడంతో ఎడపల్లి మండలం జానకంపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఈ సందర్భంగా అష్టముఖి కోనేరులో స్నానాలు చేసేందుకు పోటీ పడ్డారు. శ్రావణమాసంలో శనివారం ప్రత్యేకంగా అమావాస్య రావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో ఆలయాలను దర్శించుకున్నారు. ప్రతి అమావాస్యకు ఈ ఆలయానికి భక్తులు భారీ తరలివస్తారు. - అక్షరటుడే, ఇందూరు






జానకంపేట లక్ష్మీనృసింహస్వామి ఆలయం వద్ద కోనేరులో స్నానమాచరిస్తున్న భక్తులు



## శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న నీటివిడుదల

**అక్షరటుడే, ఆర్మూర్ :** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద కొనసాగుతోంది. ఎగువ నుంచి జలాశయంలోకి ప్రస్తుతం 78 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటిమట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా.. ప్రస్తుతం 1090.7 (79.2టీఎంసీల) అడుగుల మేర నీరు నిల్వ ఉంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండడంతో 16 గేట్లను ఎత్తి అధికారులు దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. వరద గేట్ల ద్వారా 49,280 క్యూసెక్కులు గోదావరిలోకి వదులుతున్నారు. శ్రీరాంసాగర్ నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్ట్ కింద లక్షల ఎకరాల్లో పంటలు సాగు అవుతుండగా.. ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం ఎస్కేప్ గేట్ల ద్వారా 4,500 క్యూసెక్కులు, కాకతీయ ప్రధాన కాలువకు 3,500, వరద కాలువకు 20వేలు, లక్ష్మి కాలువకు 150, సరస్వతి కాలువకు 500 క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. మిషన్ భగీరథకు 231క్యూసెక్కులు వదులుతుండగా, 651క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతోంది. ప్రాజెక్ట్ నుంచి 78,812 క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదు అవుతోంది.

## హనుమాన్ ఆలయంలో సీపీ ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నిజామాబాద్ సీపీ సాయి చైతన్య కంఠేశ్వర్ లోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసంలో చివరి శనివారం కావడంతో నీలకంఠేశ్వర ఆలయంలో వెలసిన ఆంజనేయ స్వామిని ఆయన దర్శించుకున్నారు. తెల్లవారుజాముననే ఆలయానికి చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం అభిషేకం, అర్చనలు చేశారు.



# లెక్కల్లోనే మొక్కలు!

**వనమహోత్సవం పేరిట గతంలో విరివిగా మొక్కలు నాటేవారు. వానాకాలం వచ్చిందంటే ఎక్కడా చూసినా మొక్కలు నాటుతూ కనిపించేవారు. కానీ ఈ ఏడాది మాత్రం మొక్కలు లెక్కల్లోనే ఉన్నాయి. బయట ఎక్కడా కనిపించడం లేదు. అధికారులు ఆయా శాఖలకు లక్ష్యం విధించినా.. ఎక్కడా కూడా మొక్కలు నాటుతున్న దృశ్యాలు కనిపించడం లేదు. కానీ 70శాతం లక్ష్యం పూర్తయినట్లు అధికారులు చెబుతుండడం గమనార్హం.**

**- అక్షరటుడే, ఇందూరు**

- కనిపించని వనమహోత్సవం సందడి
- జిల్లాలో లక్ష్యం 34 లక్షల మొక్కలు
- 70 శాతం పూర్తయినట్లు చెబుతున్న అధికారులు
- క్షేత్రస్థాయిలో కానరాని వైనం

వర్షాకాలంలో వచ్చిందంటే గతంలో ఎక్కడ చూసినా మొక్కలు నాటేవారు. బీఆర్ఎస్ హయాంలో హరితహారం పేరిట పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టేవారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హరితహారం పేరును వనమహోత్సవంగా మార్చింది. అయితే ఉమ్మడి జిల్లాలో మాత్రం వనమహోత్సవం హడావిడి కనబడడం లేదు. గుంతలు పెద్ద ఎత్తున తీస్తున్న దాఖలాలు లేవు. ఇళ్లకు పంపిణీ చేస్తున్నామని చెబుతున్నా.. జనం తీసుకెళ్తున్నట్లు కనిపించడం లేదు. కానీ లెక్కలు మాత్రం పక్కాగా చూపిస్తున్నారు.

### 24 లక్షల మొక్కలు నాటాం

వన మహోత్సవంలో భాగంగా నిజామాబాద్ జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటాలని అధికారులు లక్ష్యం ఇచ్చారు. అయితే ఇప్పటివరకు 24 లక్షల మొక్కలు నాటామని, 5 లక్షలకు పైగా మొక్కలు ఇళ్లకు పంపిణీ చేసినట్లు వివిధ శాఖల నివేదికల్లో ఉంది. నెల రోజులుగా ఈ కార్యక్రమం సాగుతుండగా.. పూర్తిస్థాయి వర్షాలు లేకున్నా.. ఇంత తక్కువ సమయంలో ఇంత పెద్ద లక్ష్యాన్ని ఎలా పూర్తి చేశారో అర్థం కావడం లేదు. బయట ఎక్కడా పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్న దృశ్యాలు కనిపించడం లేదు. గతంలో ఆయా శాఖల ఆధ్వర్యంలో సందడిగా వేలాది మందితో మొక్కలు నాటేవారు. కానీ ప్రస్తుతం అవేమీ లేకున్నా.. లెక్కల్లో మాత్రం 24 లక్షల మొక్కలు నాటామని అధికారులు నమోదు చేయడం గమనార్హం.

### శాఖల వారీగా లక్ష్యాలు..

జిల్లాలో 34 లక్షల మొక్కలు నాటి, సంరక్షించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో అన్ని శాఖలు భాగస్వాములు కావాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. శాఖల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉన్నా.. అన్ని విభాగాలు మొక్కలను నాటామని రోజువారీగా లెక్కలు చూపిస్తున్నాయి. గతంతో పోలిస్తే ఈసారి ప్రధాన శాఖల్లోనూ అరకొరగా కొన్ని మొక్కలు నాటి ఆర్భాటం చేస్తున్నారే తప్ప.. ప్రత్యేక శ్రద్ధతో నిరంతరం కార్యక్రమాన్ని కొనసాగించిన దాఖలాలు లేవు. అయినా ఇప్పటివరకు 70 శాతానికి పైగా పురోగతి సాధించినట్లు అధికారిక లెక్కలు ఉన్నాయి. ఇంటికి ఐదు మొక్కలు చొప్పున పంపిణీ చేస్తున్నామని చెప్పినా చాలా చోట్ల అమలు కావడం లేదు.

### క్షేత్రస్థాయి పరిశీలన అవసరం

ఆయా శాఖల్లో రోజువారీగా చెప్పిన వివరాలన్నీ కలెక్టరేట్‌లలో నమోదు చేసుకుంటున్నారు. కానీ ఇది క్షేత్రస్థాయిలో పక్కాగా నాటారా లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులు పర్యవేక్షించడం లేదు. ఎలాగూ మొక్కలు నాటి ఉంటారని ఉన్నతాధికారులు భావిస్తుండగా.. వచ్చి పరిశీలిస్తారా అని ఆయా శాఖలు నిర్లక్ష్యం చూపిస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని చోట్ల మాత్రం రోడ్డుకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్లు చేపట్టారు. వందల సంఖ్యలో మొక్కలు నాటిన కొన్ని శాఖలు వేలల్లో చూపిస్తున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో వనమహోత్సవం నామమాత్రపు వ్యవహారంగానే మారిపోయిందన్న విమర్శలు తలెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని క్షేత్రస్థాయిలో పరిశీలించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నీలకంఠేశ్వర ఆలయ చైర్మన్‌గా సిరిగిరి తిరుపతి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని ప్రతిష్ఠాత్మకమైన నీలకంఠేశ్వర ఆలయం నూతన పాలకవర్గాన్ని నియమించారు. ఈ మేరకు శనివారం దేవాదాయ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ చైర్మన్‌గా సిరిగిరి తిరుపతి నియమించారు. అలాగే ఆలయ డైరెక్టర్లుగా నందకిషోర్, మదన్మోహన్, వెంకట్ రెడ్డి, కాటిపల్లి రాజు, నాగనాథరావు, శ్రీనివాస్ గౌడ్, శంకర్, విజయ రాణి, సత్యనారాయణ, క్రాంతి కిరణ్, చంద్రకాంత్, నాగారావు, నర్సింగరావును నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా.. ఇప్పటికే నగరంలోని జెండా గుడి, గోల్ హనుమాన్ ఆలయం, శంభుని గుడి తదితర ఆలయాల పాలకవర్గాలను నియమించిన విషయం తెలిసిందే.

## ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నూతన కమిటీ



**అక్షరటుడే, గాంధారి:** ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం కామారెడ్డి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ వివరాలను సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోతి సింగ్ కామారెడ్డి పట్టణంలో శనివారం వెల్లడించారు. ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం జిల్లా అధ్యక్షుడిగా రాథోడ్ సురేందర్, కార్యదర్శిగా శ్రీనివాస్‌లను ఎన్నుకున్నట్లు వివరించారు. అలాగే యూత్ జిల్లా కమిటీని సైతం ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా బంజారా సంఘం యూత్ అధ్యక్షుడిగా శంకర్, ప్రధాన కార్యదర్శిగా రవికుమార్‌ను ఎన్నుకున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో బంజారా సేవా సంఘం నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు పింఛన్లు ఇవ్వాలి: మందకృష్ణ



**అక్షరటుడే, బోధన్:** రాష్ట్రంలో వికలాంగులకు పింఛన్లు ఇవ్వాలని లేదా సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. బోధన్ పట్టణంలో నిర్వహించిన చేయూత పింఛన్ల పెంపు సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వ తుంగలో తొక్కిందన్నారు. ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు అవుతున్నా.. పింఛన్లను పెంచకపోవడం సిగ్గుచేటన్నారు. పింఛన్లు పెంచే హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసినప్పటికీ.. ప్రతిపక్ష నాయకుడిగా ప్రశ్నించాల్సిన కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని మందకృష్ణ మాదిగ ఎద్దేవా చేశారు. ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకులు పట్టించుకోకపోవడంతో ఎమ్మార్పీఎస్ పింఛన్లు పెంచే ఉద్యమాన్ని భుజాన వేసుకుందని స్పష్టం చేశారు. ఎమ్మార్పీఎస్ వికలాంగులు, వృద్ధుల పక్షాన ఉద్యమం చేపట్టినప్పుడల్లా పింఛన్లు పెరిగాయని ఆయన గుర్తు చేశారు. హైదరాబాద్‌లో సెప్టెంబర్ 9వ తేదీన జరిగే పింఛన్ల పెంపు మహాసభకు పెద్ద ఎత్తున వికలాంగులు వృద్ధులు వితంతువులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశి, బీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు సలీం, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలో శనివారం తెల్లవారుజామున వడ్డీ వ్యాపారుల ఇళ్లలో పోలీసులు మెరుపు దాడులు చేశారు. మూడో టౌన్, నాలుగో టౌన్, ఐదో టౌన్‌ల పరిధిలోని వడ్డీ వ్యాపారుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. తనిఖీల సమయంలో పోలీసులు ప్రామిసరీ నోట్లు, డాక్యుమెంట్లు, అప్పు తీసుకున్న వారు ఇచ్చిన చెక్కులను పరిశీలించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అక్రమంగా దాచి ఉంచిన నగదును కూడా పరిశీలించారు. వడ్డీ వ్యాపారులతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చాలావరకు పేద మధ్యతరగతి ప్రజలు బలవుతున్నారని అనేక ఫిర్యాదులు అందాయి. ఇటీవల కేసులు కూడా నమోదు చేశారు. దీంతో సీపీ సాయిచైతన్య జిల్లాలో వడ్డీ వ్యాపారుల ఆగడాలు అరికట్టడానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ సౌత్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, ఆయా ఠాణాల ఎస్‌హెచ్‌వోలు రఘుపతి, హరిబాబు, శ్రీకాంత్, గంగాధర్, సిబ్బంది దాడుల్లో పాల్గొన్నారు.



## ఇక సీపీ ఎదుటే బైండోవర్..




**అక్షరటుడే, నిజామాబాద్:** రానున్న పండుగల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య కీలక నిర్ణయం తీసుకున్నారు. పాత నేరస్థులు, కమ్యూనల్ కేసుల్లో ఉన్నవారు, డీజే నిర్వాహకులను బెండోవర్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అయితే గతంలో తహశీల్దార్లు లేదా రెవెన్యూ డివిజనల్ అధికారి వద్ద బెండోవర్లు చేసేవారు. తాజాగా సీపీ కీలక నిర్ణయం తీసుకున్నారు. జిల్లా అదనపు మెజిస్ట్రేట్ హోదాలో ఆయనే స్వయంగా బైండోవర్లు చేస్తున్నారు. బోధన్ సబ్ డివిజన్‌కు సంబంధించి 13 మంది పాత నేరస్థులు, కమ్యూనల్ కేసుల్లో ఉన్నవారిని సీపీ బైండోవర్ చేశారు. వీరిలో కమ్యూనల్ కేసుల్లో ఉన్నవారు, అకారణంగా గొడవలకు దిగేవారు, డీజే నిర్వాహకులు ఉన్నారు. ఒక్కొక్కరికి రూ.50 వేల నుంచి రూ.లక్ష సొంత పూచీకత్తుతో బెండోవర్ చేశారు. మిగిలిన సబ్ డివిజన్లకు సంబంధించిన వారిని కూడా ఇలాగే బైండోవర్ చేయనున్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సీపీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గణేశ్ ఉత్సవాలు, దేవీ నవరాత్రి వేడుకలు, ఇతర పండుగల దృష్ట్యా ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే పదేపదే అల్లర్లకు పాల్పడే వారు, కేసులు నమోదై ఉన్న డీజే నిర్వాహకులను అదనపు మెజిస్ట్రేట్ హోదాలో ఆయనే బైండోవర్లు చేస్తున్నారు. గతంలో తహశీల్దార్ల వద్ద బైండోవర్లు చేసినా.. నిందితులు తిరిగి నేరాలకు పాల్పడేవారు. బైండోవర్ల ఉల్లంఘన జరిగేది. ఈ నేపథ్యంలో కమిషనరేట్ అధికారాలను ఉపయోగించి ఒక్కొక్కరిని 6 నెలల పాటు బెండోవర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా చేయడం ద్వారా నిందితుల్లో సత్ప్రవర్తన ఏర్పడుతుందని కమిషనరేట్ అధికారులు భావిస్తున్నారు.



## ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు మంజూరు చేయాలి

**అక్షరటుడే, భీమ్‌గల్:** మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు కొత్త భవనాలు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆధ్వర్యంలో నాయకులు హైదరాబాద్‌లో లో పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో నిలిచిపోయిన 100 పడకల ఆస్పత్రి, సమీకృత మార్కెట్ సముదాయ భవనాల పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తేవాలని కోరారు. మండలంలో తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అగ్రికల్చర్, ఎంఈవో, డిగ్రీ కళాశాల, గెస్ట్ హౌస్, నూతనంగా మంజూరైన కోర్టు, ముచ్కూర్ సొసైటీ భవనం, రహత్ నగర్‌లో గోదాములు తదితర కార్యాలయాలకు కొత్త భవనాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బొదిరే స్వామి, పట్టణాధ్యక్షులు జేజే నర్సయ్య, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కుంట రమేష్, కార్యదర్శి భోజా గౌడ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మల్లెల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేత



**అక్షరటుడే, నిజాంసాగర్:** వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రైతులకు రాయితీపై వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి అమర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, మహిళా, చిన్న, సన్నకారు (ఐదు ఎకరాల్లోపు) రైతులకు 50శాతం సబ్సిడీపై పనిముట్లు అందజేస్తున్నట్లు ఆయన వివరించారు. పెద్దకారు రైతులకు 40శాతం సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ధృవపత్రాలు అప్లికేషన్ ఫారం, పట్టదార్ పాస్ పుస్తకం (జిరాక్స్), ఆధార్ కార్డు జిరాక్స్, ట్రాక్టర్ ఆర్సీ జిరాక్స్ మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక తర్వాత సంబంధిత పరికరం సరఫరా చేసే కంపనీ పేరున డీడీ తీయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

## మహమ్మద్‌నగర్ తహశీల్దార్ కార్యాలయానికి పోస్టులు మంజూరు



**అక్షరటుడే, నిజాంసాగర్:** కొత్తగా ఏర్పాటైన మహమ్మద్‌నగర్ రెవెన్యూ మండలానికి 13 పోస్టులు మంజూరయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్‌తో పాటు ఇద్దరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్ట్, సర్వేయర్, చైన్‌మన్, ముగ్గురు అటెండర్ పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మండల రెవెన్యూ కార్యాలయానికి సరిపడా పోస్టులు మంజూరు కావడంతో పోస్టింగులు ఇవ్వడానికి ఉన్నతాధికారులకు మార్గం సుగమమైంది. ఇంతకాలం డిప్యూటేషన్‌పై ఒకరిద్దరు అధికారులు, సిబ్బందితో కార్యాలయంలో పనులను నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పూర్తిస్థాయి సిబ్బంది వచ్చినట్లయితే పనులు సజావుగా జరుగుతాయని మండలవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మహమ్మద్ నగర్ తహశీల్దార్ కార్యాలయానికి నూతన పోస్టులు మంజూరు కావడంతో మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఖాళీ అవుతున్న సింగితం..!

మహమ్మద్ నగర్ మండలంలోని సింగితం రిజర్వాయర్ ఖాళీ అవుతోంది. రిటైనింగ్ వాల్ మళ్లీ కొట్టుకుపోవడంతో రిజర్వాయర్‌లోని నీరంతా వృథాగా పోతోంది. దీంతో యాసంగి సాగుపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

- అక్షరటుడే, నిజాంసాగర్

■ మళ్లీ కొట్టుకుపోయిన రిజర్వాయర్ రిటైనింగ్ వాల్ ■ యాసంగి సాగుపై రైతుల్లో ఆందోళన

నిజాంసాగర్ ఆయకట్టుకు అనుసంధానంగా 416.50 మీటర్లతో సింగితం రిజర్వాయర్ నిర్మించారు. రిజర్వాయర్‌కు కుడి, ఎడమ రెండు పంట కాల్వలు సైతం నిర్మించారు. కుడి కాలువ కింద మహమ్మద్ నగర్, గున్కుల్, బూర్గుల్ ప్రాంతాల్లోని పంటలకు నీరందుతుండగా, ఎడమ కాలువ ద్వారా నర్వ గ్రామానికి చెందిన సుమారు 550 ఎకరాలకు నీరందుతోంది. పెద్దగుట్ట, వర్ని, తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు సింగితం రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరుతోంది. ఈ నీటిని నిజాంసాగర్ ఆయకట్టుకు వినియోగించుకోవడంతోపాటు సింగితం రిజర్వాయర్ కింద 550 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. గతేడాది భారీ వర్షాలకు రిజర్వాయర్ రిటైనింగ్ వాల్ కూలిపోయింది. దీంతో అధికారులు రూ.8.4లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఇందులో భాగంగా ఇసుక బస్తాలు వేసి వృథాగా నీటికి అడ్డుకట్ట వేశారు. అయితే, కొద్దిరోజులకే మరోమారు రిజర్వాయర్ రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయింది.

### నిధులు మంజూరు చేయకపోవడంతో..

రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం ఇరిగేషన్ అధికారులు రూ.1.8 కోట్లతో ప్రతిపాదనలు పంపించినా, నిధులు మంజూరు కాలేదు. దీంతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టడంతో భారీ వర్షాలకు రిటైనింగ్ వాల్ కొట్టుకుపోతోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లోని నీరంతా వృథాగా మంజీరలోకి వెళ్తుండడంతో యాసంగి పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది.

### శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



సింగితం రిజర్వాయర్ రిటైనింగ్ వాల్ గతేడాది వర్షాలకు కొట్టుకుపోయింది. తాత్కాలికంగా ఇసుక సంచులు వేసినా.. అవి కూడా ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయాయి. శాశ్వత మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి. – మనీష్ రెడ్డి, రైతు, బూర్గుల్

### నీరు ఖాళీ అవుతోంది..



ఇటీవల వర్షాలకు సింగితం రిజర్వాయర్ నిండుకుండలా మారిందని సంతోషించే లోపే రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయింది. రిజర్వాయర్‌లోని నీరంతా వృథాగా పోతోంది. కొద్ది రోజుల్లోనే రిజర్వాయర్ పూర్తిగా ఖాళీ అవుతుంది. – రాజిరెడ్డి, రైతు, మహమ్మద్‌నగర్

### అధికారులు స్పందించాలి..



సింగితం రిజర్వాయర్ కిందనే సాగు భూములు ఉన్నాయి. కానీ, రిజర్వాయర్ రిటైనింగ్ వాల్ పలుమార్లు కొట్టుకుపోతోంది. దీంతో రిజర్వాయర్‌లో నీరు వృథాగా పోతోంది. పంటలకు నీరందడం లేదు. అధికారులు శాశ్వత మరమ్మతులు చేపట్టాలి. – దుర్గా ప్రసాద్, రైతు, నర్వ

## సీపీఎస్‌ను రద్దుచేయాలి



**అక్షరటుడే, లింగంపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వంద రోజుల్లో సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం వెంటనే ఓపీఎస్ పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సంగమేశ్వర్, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## టాయిలెట్స్ నిర్మాణానికి నిధులు మంజూరు



**అక్షరటుడే, కామారెడ్డి:** బిచ్కుందలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు డీఈవో రాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాలికల ఉన్నత పాఠశాలలో 300 మందికి సరిపడా టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని కలెక్టర్ దృష్టికి రావడం వచ్చిందన్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ నిధుల నుంచి 10 టాయిలెట్స్ బ్లాక్ నిర్మాణానికి రూ.6.90 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

## పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని బ్రాహ్మణపల్లి అంజనాద్రి క్షేత్రం నుంచి మెదక్ జిల్లా కొప్పుల్ సంగమేశ్వర ఆలయం వరకు శ్రావణ మాస ముగింపు సందర్భంగా కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఇందులో నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ రమేష్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు జగదీశ్వర్ చారి, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు సురేష్ గౌడ్, మాజీ ఎంపీటీసీ దత్తు, మాజీ సర్పంచులు గోపాల్ రెడ్డి, యాకూబ్, ఆనంద్ పటేల్, రామకృష్ణ, మాణిక్ రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు పెద్దడ్ల నర్సింలు, పట్టణ అధ్యక్షుడు రాజేష్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని సమస్యలపై వివరించారు. రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేయాలని, పోచారం కాలువలో పిచ్చి మొక్కలు తొలగించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని కోరారు. గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు లేక గ్రామ పాలన కుంటు పడిందని, స్థానిక సంస్థల ఎన్నికలు త్వరగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేందర్, మర్రి బాలకిషన్, మాజీ అధ్యక్షుడు ఎస్ ఎన్ రెడ్డి, నాయకులు రాములు, నరేష్, నర్సింహా రెడ్డి, జక్కుల అశోక్, బద్దుల రాములు పాల్గొన్నారు.

## మర్పల్లిలో వైద్య శిబిరం



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండలంలోని మర్పల్లిలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. పిట్లం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చికోటి మనోజ్ కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఏలే మల్లికార్జున్ హాజరై ప్రారంభించారు. నిజాంసాగర్ ప్రాజెక్టు అచ్చంపేట, ఆరేపల్లి గ్రామాల వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో నాలుగు రోజులుగా గ్రామం ముంపునకు గురైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో శిబిరం నిర్వహించి, అవసరమైనవారికి మందులు అందజేశారు.

## కామారెడ్డిలో దొంగల హల్‌చల్..

**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలో దొంగలు హల్‌చల్‌సృష్టించారు. తాళంవేసిన ఇళ్లను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడ్డారు. తాజాగా శుక్రవారం పట్టణంలోని స్నేహపురి కాలనీలో తాళం వేసి ఉన్న మూడిళ్లలో ఒకే రోజు చోరీకి పాల్పడ్డారు. అర్ధరాత్రిలో కాలనీలోకి ప్రవేశించిన దొంగలు.. మూడు ఇళ్లలో 2 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వామ్మో.. కొండచిలువ



గాంధారి మండలంలోని చద్మల్‌తండాలో భారీ కొండచిలువను గ్రామస్థులు గుర్తించారు. గ్రామానికి చెందిన బస్సీ ఓగ్యా తన పొలంలో సోయా పంటను పరిశీలిస్తుండగా పెద్ద కొండచిలువ కనిపించింది. దీంతో స్థానిక రైతులకు సమాచారం అందించగా వారంతా కలిసి కొండ చిలువను చంపివేశారు.

– అక్షరటుడే, గాంధారి



## పంట నష్టాన్ని ప్రకటించాలి


**అక్షరటుడే, లింగంపేట:** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మంజీర నది ప్రవాహంతో నాగిరెడ్డిపేట మండలంలోని గోలి లింగాల, మాల్ తుమ్మెద, చీనూర్, వాడి, లింగంపల్లి, వెంకంపల్లి, తాండూర్, ఎర్రారం, ఆత్మకూర్ గ్రామాల్లో సుమారు 1200 ఎకరాల్లో పంటలు నీట మునిగగాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, బాధిత రైతులకు పంట నష్ట పరిహారం అందించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తహశీల్దార్ శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేయకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా.. రైతులకు ఫసల్ బీమా అందజేసి నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ. 40 వేల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకుడు హనుమాన్లు, కిషన్, ఈశ్వర్ గౌడ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## దంపతుల మధ్య గొడవ.. భర్త దాడిలో భార్య మృతి

**అక్షరటుడే, కామారెడ్డి:** క్షణికావేశం ఓ మహిళ ప్రాణాలను తీసింది. దంపతుల మధ్య జరిగిన చిన్నగొడవలో కోపోద్రిక్తుడైన భర్త భార్యపై దాడి చేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సదాశివనగర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని జ్యోతినగర్ కాలనీలో చిందం లక్ష్మి – రవి దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు సురేష్, మహేష్ ఉన్నారు. సురేష్ హైదరాబాద్‌లో పని చేస్తుండగా మహేష్ బతుకుదెరువు కోసం దుబాయ్ వెళ్లాడు. అయితే శుక్రవారం రాత్రి రవి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య వంట చేస్తుండగా దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. ఆ సమయంలో కోపంతో భార్య భర్తను కొట్టింది. దీంతో కోపోద్రిక్తుడైన రవి 'నన్నే కొడతావా' అంటూ సమీపంలో ఉన్న రాయితో భార్యపై దాడి చేశాడు. ఈ దాడిలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## దీపం అంటుకుని ఇల్లు దగ్ధం

**అక్షరటుడే, ఇందల్వాయి:** ఇందల్వాయిలోని ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటన శనివారం మండలంలోని సిర్నపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మరకల రాజు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లాడు. ఆయన భార్య శనివారం ఇంట్లో పూజ చేసిన అనంతరం దీపం వెలిగించింది. ఆమె ఇద్దరు పిల్లలు పాఠశాలకు వెళ్లగా.. పనినిమిత్తం ఆమె బయటకు వెళ్లింది. ఈ క్రమంలో గాలికి దీపం పక్కనే ఉన్న పేపర్లకు అంటుకుని అగ్నికీలలు ఇళ్లంతా చుట్టుముట్టాయి. క్షణాల్లోనే మంటలు పెంకుటిళ్లంతా వ్యాపించాయి. గమనించిన స్థానికులు ముందుగా కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక శాఖ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన అగ్నిమాపక సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని



మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంట్లో ఉన్న సామాగ్రి పూర్తిగా కాలిబూడిదైందని స్థానికులు తెలిపారు. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లో మంటలు చెలరేగి పైకి వచ్చేంతవరకు ఎవరూ గమనించలేదన్నారు. ఎంత ఆస్తి నష్టం జరిగిందో తెలియాల్సి ఉంది.